# నేనూ అంతేనేమో !

అమ్మ మామయ్యని అడగాలని వచ్చినా మామయ్య మౌనము బాధగాతోచింది. వచ్చి వారం అయినా అన్నగారు తను అడిగినదానికి ఎటూ చెప్పలేదు.మళ్లీ వకసారి కదిలించి చూసింది. ‘ నీమాట తీసుకుని వూరికిపోదాము అని చూస్తున్న, ఏమంటావు అన్నయా?’

‘అనేందుకు ఏమివుందమ్మా అన్నీ నీకు తెలిసినవేగా. పెద్దాడి పిల్లని వకయింటిదాన్ని చేసేబాధ్యత నా మీద వుందాయె, సరే చిన్నాడు ఏమన్నా కలిసివస్తాడా అంటే అది లేదు సరికదా వాడిసంసారం కూడా నేను మొయ్యాల్సివచ్చే. యింతకీ ఆ కంపెనీ ధర్మాన్నే యింతమందికి తిండికి లోటు లేకుండా జరుగుతోంది’.

‘నీ మనసులో పెట్టుకునే వుద్దేశ్యం వుండాలేకాని నా పిల్లలు యిద్దరు నీకు బరువవుతారా? ఈ నాటికి మా స్థితి యిల్లా అవబట్టి మిమ్మల్ని మిమ్మల్ని బతిమాలాల్సి వచ్చింది. డబ్బు వున్న రోజుల్లో అంతా తిన్నవాళ్ళే, అవి అన్నీ తలుచుకుంటే ఎంతో బాధగా వుంటుంది.

మళ్లీ అభిమానం చంపుకు అడుగుతున్నా, ఈ రెండు ఏళ్లు మాటదక్కించు అన్నయ్యా. నేను అడిగేదిఅల్లా యిద్దరికీ గుప్పెడు అన్నము పెట్టమనే. జీతముడబ్బు ఆరంగమ్మగారికాలూ, కడుపు పట్టుకుంటే సాయంచేస్తాను అంది.

అది కాదమ్మాయి, ఏదైనా అంటే నీకు కోపమువస్తుంది కాని వాడుయిప్పుడు కాలేజీలో చదవకపోతే వచ్చేనష్టం నాకు అర్థము కావటంలే. మొయ్యలేనా బరువు మొయ్యటం నాచేత కాదుసుమా. వాడిని ఏదోపనిలో చేరిపిస్తే వేడినీళ్లకు చన్నీళ్లు తోడు అన్నట్టుగా ఏదో

నీసంసారం లాక్కురావచ్చు. చిన్నాడి చదువు సాగుతుంది.

'మీ బావ చెపుతూనే వున్నారు, అడిగినా వాళ్లు ఏమీ పెట్టుకోరు అని. సిగ్గులేనిదాన్ని నేనే తయారయ్యా' అంది అమ్మ.

'మీ ఆయనా చెప్పొచ్చాడు. ఆరునెలలు వున్నానో లేదో మీ యింట్లో అడ్డమయిన చాకిరి చేయించుకుని నా గడ్డి నాకు పెట్టారు. నాకు అల్లా చేయించుకోవడం రాదు. వుంటే నాతో పాటు చూస్తా లేదా వీలుపడదని చెపుతా, అంతేకాని నంగినంగి మాటలు ఎదురుగా చెప్పి చాటుగా తిట్టి పొయ్యను'.

'ఏమండోయ్ నామాట కొంచెము వినిపించుకోండి' అని కాంతము కేకపెట్టింది వంటగదిలోంచి.

'ఏమిటి నీ గోల'.

'ఇల్లారమ్మంటే అక్కడనించే బొబ్బలు పెడతారేమిటి?'

'సరే, చెప్పేది ఏమిటోకానీ.'

'వాళ్లకి తిండేగా పెట్టమంటూన్నది మీ చెల్లెలు. బట్టలు, జీతం వాళ్లే అవస్తపడుతారు నామాటవిని వుండనీండి.'

'ఇప్పుడు బాగానే వుంటుంది తరవాత నువ్వు చెయ్యలేక, నేను తేలేక చస్తాం.'

'ఎల్లాగో వకలా అవస్తపడదాము వుండనియ్యండి.'

'పరాయిదయినా అన్నయ్యకంటే వదినేనయం.'

'ఆ, నయమే యింకో నాలుగురోజులు పోయాక చెయ్యలేక చస్తున్నానని తెల్లవార్లు నన్ను చంపుకుతింటుంది.'

'ఏమిటండి ఆ మాటలు. అవి అన్నీ నిజం అనుకోరూ. ఎప్పుడయినా ప్రాణం విసిగి అనుకున్నాను ఏమో, దాన్ని యింత రాద్ధాంతము చేస్తారనుకోలేదు. నా తెలివితక్కువ కాకపోతే మీ గొడవల్లో ఎందకు కలుగచేసుకోవాలి? మాటలుపడ్డము దేనికి?'

'అబ్బ నిన్ను ఏమి అన్నారే యిప్పుడు, వంట అవుతే వడ్డించు పోవాలి.'

'ఏవమ్మోయి సూరమ్మా యిక్కడ తుడిచి పీటలు వెయ్యి. ఆ గోడవారని పచ్చడిగిన్ని వుందికాని ముట్టుకోకుండా వెళ్లు. చూడండి అత్తయ్యా నేను యిక్కడ వాగుతూనేవున్న, నానిపని అక్కడ కానిచ్చింది. ఆకొంగుతో దాన్ని కొట్టింది. బొత్తిగా మడి మైలా తెలీదు, ఏమి పెంపకమో!'

'చూడలేదు అక్కయ్యా.'

'పోనీలే దాన్ని గురించి వుపన్యాసం యివ్వకు పనికానీ.'

కాంతము సహజంగా చాలా తెలివైనది, గడుసుది మంచి మాటనేర్పుకల మనిషి. తనకి వుపయోగము కొంతేనా లేకపోతే దేనికీ ఆమోదించే రకము కాదు. గృహకృత్యాలలో కూడా యింటిపని అత్తగారు, తోడికోడళ్లచేత చేయింది, బయటవాళ్లకి అంతా తనే చేస్తున్నట్లు కనపడే చాకచక్యము మరొకరిలో మనము చూడకపోవచ్చు. మహాలక్ష్మమ్మ అన్న గారిచేత ఆం అనిపించుకొని ఆ రోజే వూరికి బయలుదేరింది.

నారాయణమూర్తిని కాలేజీలో, గోపిగాణ్ణి హైస్కూలులో చేర్పించమని తెచ్చిన డబ్బు అన్నగార్కి యిచ్చి వెళ్లింది మహాలక్ష్మమ్మ. 'అమ్మని రైలు ఎక్కించిరా, నారాయణ మూర్తి' అన్నాడు మామయ్య. అమ్మని రైలు ఎక్కించేందుకు వెళ్ళాను.

'ఒరేయి అబ్బాయి వాళ్లు ఎవరు ఏమన్నా ఎదురు చెప్పకుండా ఏదిపెడితే అదితిని ఏదో కాలం గడుపుకోండి. యిప్పుడు మన అవసరం, నేను చెప్పేది అర్థంచేసుకో, తెలిసిందా.

ఏదయినా మరీ అవసరం అయితే వ్రాయి. తల తాకట్టుపెట్టి అయినా పంపుతాము. మీరు మాత్రము అవస్తపడకండి' అని చెప్పంది.

నారాయణకి కళ్లనీళ్లు తిరిగాయి తల్లిమాటలు వింటోంటే. 'యింత కష్టపడి యిన్ని మాటలుపడి చదివిస్తోంది. తరువాత ఏమి సుఖపడతామొ ఏమొ' అనుకున్నాడు.

'అబ్బాయి జాగ్రత్త, నామాటలు మర్చిపోకు, బాగా చదువుకోండి నాయినా.'

'అబ్బాయి వెళ్లివస్తావు ఉత్తరాలు రాస్తూవుండునాయినా' అని ఆ కొద్దిసేపటిలో జాగ్రత్త, బాగా చదువుకోమని వెయ్యి సార్లు చెప్పింది. ఆవిడ అమాయకత్వానికి జాలివేసింది.

అమ్మ వెళ్లినా వెఱ్ఱిగా ఆపక్కే చూస్తూ కూర్చుని పోయా. అంతగోలగావున్న ప్లాటుఫారం కొద్దిసేపట్లో నిర్మానుష్యంగా భీతిగొల్పుతూ కీచురాళ్లకి, కప్పలకీ పోటీ పెట్టినట్లు ఒక శబ్దంకంటె, ఒకటి గట్టిగా వినపడాలి అనే వుద్దేశ్యంతో చెవులు చిల్లులుపడేటట్టు అరుస్తున్నాయి.

'ఎవరు అక్కడ కూకుంటా, ఎవరు అంటే మాట్టాడవే, ఏం', అని వెనకనించి ముసిలికూలీ ప్రశ్నతోటి వులిక్కిపడి లేచా.

'ఏంటికద? మాట్లాడవేమి పరీక్షకాని పోయింది, ఎఱ్ఱిఏసాలు ఎయ్యక యింటికిపోయి సుఖంగుండు. బతికుంటే బలుసాకు తినొచ్చు.'

'ఏరా, మావ, యింటికి రావా ఏమి. నే పోతుండా' అని యింకోకూలీ వచ్చాడు.

'వత్తుండారా, ఈ కుఱ్ఱాయిన ముఖము చూస్తే ఏదో అగాయిత్యము చేసేవోళ్లాగుంటే కనుక్కుందాము అని యిట్టావచ్చా' అన్నాడు.

'నాకేం ఖర్మ చావటానికి, కాసేపు కూర్చుని పోదాము అనుకున్నా. మీ కెందుకు నా గొడవ వెళ్ళండి' అన్నా.

'ఈ కబుర్ల కేంలే, యింతకంటె ధీమాగానే చెప్పాడు ఆ రాజుగారి అబ్బాయి. నీ బట్టలు అయినా మాసివున్నాయి. ఆ కుఱ్ఱోయన ఏమి హోషుగున్నాడు. కొత్తబట్టలు, అత్తరు పూసుకుని, సేతినిండా పేపర్లుపట్టుక్కూకుంటే దొర్లాగున్నాడు. ఆయాలకూడా నేనే అడిగా యిక్కడ కూకుండావే అని. పట్నం పోతున్నానని చెప్పాడు. నిజమే కామోల్ను అనుకున్నా అర్ధరాత్రికాడ కబురువచ్చిందిరమ్మని. వచ్చి చూస్తునుకందా ఆ కుఱ్ఱోయన్ను సూడంగానే కడుపులో దేవేసింది అనుకో.'

'శుభమా అని చదువుకుందాము అని ఈ వూరువస్తే చావో అని మొదలుపెట్టావు ఏమిటి నువ్వు.

'ఏరోయి మావ! మనము పోదాముర్రా, నూకలుతీరాయి ఏమొ, నువ్వు సెప్పింది బుఱ్ఱకి ఎక్కటంలే. ఎవడిఖర్మ ఆడిది, రాహేసి పోదాము.

'ఎందుకు మాష్టగోర్ని పిల్చుకొస్తేసరి.'

'ఆగరోవు మావోయి! ఆయని కనిపించామొ యింటికెళ్లి నీళ్లు మొయ్యి, పిల్ల నెత్తుకో అని పురమాయిత్తాడు. ఎల్లాగో తప్పించుకుత్తే మళ్లీ ఆయనకాడికి పోదాము అంటావే, నీకుగాన వోపిగుంటే ఎల్లు నే పోతుండా యింటికి'.

'వుండి ఏహే, నీళ్లయినా మొయ్యొచ్చుకాని, రాత్రి అంతా జాగారం చెయ్యవద్దా యీయనసత్తే.'

'వాళ్లమాటలు వింటోంటే వొళ్ళు మండిపోయింది. మళ్లా నాలోనేనే తమాయించుకుని కిక్కురుమనకుండా లేచి యింటికి బయలుదేరా. నేకొంతదూరం వెళ్లేదాకా ముసలాడు చూస్తూనే వున్నాడు. చిత్రమైన మనుష్యులు. వాళ్లధోరణి కాని మనమాట వినిపించుకోరు.

పాపం వాడినని లాభము ఏమిటి, వాడి జీవితంలో ఎంతమంది చస్తే కాపలాకాసేడో. నా పాలకం కూడా వాడి అనుమానానికి తగ్గట్టుగానే వుండి వుండాలి. ఏవో అలోచిస్తూ యింటికి వేచ్చేసరికి బాగా చీకటి పడింది. రాగానే అమ్మమ్మ కోప్పడింది. యింత రాత్రి దాకా ఏమిరాచకార్యము చక్కపెట్టావు? రైలువెళ్లి ఏజాము అయింది. ఏమయ్యావో కొత్తవూరు అని మనసులో పిసుక్కుచస్తున్నా.'

ఆవిడ అన్నదానిలో తప్పులేకపోయినా ఆమాటలు చాలా బాధపెట్టాయి. వెఱ్ఱిదుఃఖము వొచ్చింది పెరటిలో' వెళ్లి మొహము కాళ్లు కడుక్కుని వచ్చి అన్నానికి కూర్చున్నా.

అత్తయ్య వడ్డిస్తూ ' అల్లా వున్నావేం మీ అమ్మ వెళ్లారనా' అని ఎంతో అప్యాయంగా అడిగింది.

ఆవిడసంగతి అంతకుపూర్వము నాకు సరిగ్గా తెలీదు. 'అన్నము చల్లారిపోయింది. వేడి అన్నము వుంటే కొంచెము పెట్టు అత్తయ్యా' అన్నాను.

'అంతా ఇల్లాగేవుందిలే తిను' అంది. అసలే పొడి అన్నము, పచ్చడిముద్ద కంఠము దిగటంలేదు. వుండచుట్టుకుబైటికివస్తోంది. 'కొంచెము నెయ్యి వేస్తావా' అని అడిగా. గిన్ని వూడ్చి వర్షపు చినుకంత అభికరించింది.

'మీ అమ్మలా అప్పలు చెయ్యటం మీ మామయ్యకి యిష్టంవుండదు. అందుకనే ఆయన ఒక్కరికీ వేస్తాం. మేము ఎవరము నెయ్యి వేసుకోము. మాతోపాటె మీరు' అంది 'ఎల్లాగో పూర్తిచేద్దాము' అని మజ్జిగ పొయ్యమన్నా. అలాంటి వాసనమజ్జిగ పుట్టాక తిని ఎరగం. ఇంటి దగ్గర భోజనం కలల్లో కట్టినట్టుయింది. నాన్నవందలు వందలు ఎత్తి పంపలేకపోవచ్చు కాని భోజనము పోల్చిచూసుకుంటే మాది జమీందారితిండి అనిపించింది.

వేడి అన్నము, వేపుడు ముక్కలు చారులోకూడా నెయ్యి లేకుండా తినలేని తిండికి అలవాటు చేసింది అమ్మ. బామ్మ చెప్పి నట్టు కరిణీకం పరీక్ష పాసై యింటిదగ్గర కూర్చుంటే ఎంతో బాగుండేదనిపించింది. యిల్లా ఆలోచన పోయేదే కాని అత్తయ్య కేకతో గబగబామింగి చెయ్యికడుక్కు బయటపడ్డా!

తెల్లవారుజామున లేచి చదువుదామని లాంతరు కోసము తడుముకుంటున్నా. యింతలో కాంతము అత్తయ్య కంఠము వినిపించింది. 'పడుకో, యిప్పటినిండి ఏమి చదువుతావులే, పగలంతా చదివితే చాలు' అని దీపము బుడ్డీ వెలిగించి చిన్నత్తయ్యని లేపి 'నీళ్లకి వెళ్లమని' పురమాయించింది. పెద్దత్తయ్యని లేపి వేడినీళ్లు పెట్టమని, ఆవిడ కూతురు శాంతని లేపి పెసలు రుబ్బమని చెప్పి, బామ్మతో 'పాలసుబ్బమ్మ దగ్గరికి వెళ్ళి వో సోలెడు పాలు పొయ్యమని తీసుకురండి అత్తయ్యా' అని అంతా ఆప్యాయంగా గిన్నిచ్చి పంపింది.

పెద్దమామయ్య చిన్నవయస్సులోనే గతించాడు. కూతురు శాంత, కాంతమ్మ అత్తయ్య దగ్గరే వుంటుంది. వాళ్ల అమ్మ మేనమామల యింటికి వెళ్ళినా అది వెళ్లనంటుంది. తల్లిమీద నేరాలు బామ్మకి, కాంతమ్మ అత్తయ్యకి చెపుతుంది.

దినకృత్యాల్లో నాకు మా గోపికి కొన్ని పురమాయించింది. వారానికి ఒకరోజు పల్లెకి వెళ్ళి సంతలో కుండెడు పెరుగు జాగ్రత్తగా చవకగా తెచ్చేపని గోపీకి. కాయకూరలు తేవటం, మామయ్యకి మధ్యాహ్న భోజనము తీసుకువెళ్లటం నాకు నియమించింది. మామయ్య మొదట భోజనము తేవద్దన్నా అత్తయ్య ఏమందో మళ్లీ ఆమాట ఎత్తలేదు.

కాలేజీకి కంపెనీకి చాలా దూరము. మొదట చాలా కష్టంగావున్న కాలము జరుగుతోన్న కొద్దీ అలవాటయి, ఒక రోజు వెళ్లక పోతే ఏదో మర్చిపోయినట్టు రోజంతా తడుము కునేవాణ్ణి.

మా గోపీ, వాళ్లు ఒకటి అంటే వాడు రెండు అనేవాడు. ఎంతచెప్పినా వినేవాడు కాదు.

ఒకవారం పెరుగు తక్కువ తెచ్చాడని అత్తయ్య అనుమానంపడి అమ్మతో 'చూడండి అత్తయ్యా నాకేమి గోపీమీద పగా? మీరు చూడండి, యిప్పటినించి ఏమి బుద్ధులు చెప్పండి' అంటోంటే గోపీగాడువిని, పెద్దగొడవ పెట్టుకున్నాడు. అంతలో మామయ్యా అందుకుని చెయ్యిచేసుకుని బైటకి పొమ్మన్నాడు.

వాడు పెట్టిబేడాకట్టి బైలుదేరాడు. మళ్లీ అత్తయ్య అంతా తనని మెచ్చుకోవాలని 'గోపీ నామాటవిను యీసారికి ఏమీ అనుకోకు; మీ మామయ్య కోపము ఎరగవుకనకనా. అనవసరంగా చదువు పాడుచేసుకోకు. మీ అమ్మ మొహం చూసి మిమ్మల్ని పెట్టుకుంట. మీ మామయ్య వెఱ్ఱికాని పెడితే తింటారుకాని కొడితే పడతారా ఈ రోజుల్లో' అని యింకా ఏవో అనబోతోంది. యింతలో వాళ్ల అన్నయ్య సుబ్బారాయుడుగారు పిల్లాడిని తీసుకురావటంచూసి 'ఎప్పుడు రావటము అన్నయ్యా' అంటూ చాటంత మొహము చేసుకుని ఎదురువెళ్లింది. ఆ కుఱ్ఱాడు అత్తయ్యనిచూసి శ్రుతిపెట్టిలా నోరుముయ్యకుండా రాగము మొదలు పెట్టాడు. వాడిని వూరుకోపెట్టే ప్రయత్నంలో అన్నాచెల్లెలు కొంతసేపు అవస్థపడ్డారు. ఏమీ లాభములేక పోయింది.

నా దురదృష్టంకొద్దీ వాళ్లకంట నేనుపడ్డా, 'వాడిని ఎత్తుకువెళ్లి బిళ్ళలు కొని పెట్ట మని అర్థణా యిచ్చి బైటికి కుర్రాథితో సహా తరిమారు, వాడిని ఎత్తుకున్నానన్న మాటేకాని వొళ్ళంతా జెఱ్ఱులు పాకుతోన్నట్టువుంది. వాడి రూపుతో నాకేమిపనికాని ఆ ముక్కు నా చొక్కాకి రుద్దుతోంటే భరించలేక ఒక్కటి తగిలించా. దాంతో ఆ వీధి ఎగిరిపోయేట్టు అరవటం మొదలుపెట్టాడు. వీడి ఏడుపువిని యింటిల్లిపాది ఎక్కడ పరుగెత్తుకువస్తారో అని గబగబా వాడిని దూరంగా లాక్కుపోయి నోరునొక్కి, మరికొంచెము చురుగ్గా నోరుమూసిందాకా తగిలించా లోపలే మింగి ఎగువపులు మొదలుపెట్టాడు. వాడికి ఏదో కొనియిచ్చి కొంతసేపు అక్కడా యిక్కడా కూర్చుని యింటికి తీసుకువచ్చా. మళ్లీ వాళ్ళని చూసి రాగముతీసే మొహము పెట్టాడుకాని, నాకేసి చూసి వూరుకున్నాడు, ఎవరికీ లొంగనివాడు నాకు భయపడ్డాడు అని లోపల కొంత గర్వపడ్డా. ఛాతీవిర్చుకు బొత్తాము సవరించుకు బైటికిపోయా.

ఆ రాత్రి నా చోటు చుట్టము మామయ్యగారు ఆక్రమించారు. నా పడక వెనకపక్క అరుగుమీదకే ఫిరాయించా. మొదట నిద్రపట్టినా కొంతసేపట్లో మెలుకువచ్చి నిద్రపట్టే సూచన కనపడలేదు. చీకటంటే చచ్చే బయము. దానికి సాయము ఎవరో మనిషి వెళ్లిన అలికిడయింది. దొంగ ఏమోనని ఎల్లావున్నవానిని అల్లాబిగుసుకు పడుకున్నా. కొంతసేపటిలో గుసగుసలు వినపడ్డాయి. వళ్లంతా తిమ్మిరెక్కి చెమటపట్టి స్పృహతప్పినట్లయింది. కొంతసేపటికి అవతలమాటలు వినేస్థితిలోకివచ్చా. మాటాడేది అత్తయ్య, మామయ్యా, అని అర్థమయింది. అత్తయ్య కంఠమే ఎక్కువ వినిపించింది, ' నామాట వినండి ఆడపిల్లకి పెద్దమనిషి అవడమే లెక్కకాని ఏళ్లతో నిమిత్తములేదు. అసలు అది ఎత్తరిపిల్ల- అందులో ఇంత సంపాయించు కున్నాడు. పిల్ల సుఖపడుతుంది. మనకి కొంత బెడద తీరుతుంది. మనము పెళ్ళి చెయ్యాలి అంటే ఏమీ లేనివాడికి యిచ్చినా అరసంచివుంటేతప్ప. పిల్లవాళ్లయింటికి వెళ్లదు. ఇంతకి వాడిమరదల్ని యివ్వనన్నారు కనక మనకి యిల్లా అనుకునే అవకాశం వచ్చింది. తరువాత మీ యిష్టం' అంటోంది అత్తయ్య.

'అదికాదే నాకు మాత్రము యిష్టం లేకనా? వాళ్లంతా ఎప్పుడు వదులుతారా అని నాకుంది. కాని లోకము ఏమనుకుంటుందో అని భయము. తండ్రి లేడుకదా అని పాతికేళ్ల వారవున్నా యిచ్చి చేశాడని వాదుపడుతుంది. నారాయణ కిచ్చి ముడిపెడదాము అనుకున్నాముగా అల్లా చేద్దాములే.'

'సరేలెండి అన్నయ్య పెళ్లి అయ్యేదాకా అక్కడవుండి వస్తా. మీరు మీ వాళ్లు ఏమన్నాకండి, వాడికి పెళ్లి అవదని మీరు భయపడకండి. అసలు మీ యింట్లో విశ్వాసము అన్నమాట లేదు. ఏంచేస్తే ఏమిలాభము. గానుగ ఎద్దులా చాకిరి చేస్తే యింత తిండివేస్తున్నారు. నామాటకి విలువ ఏడిస్తేగా.'

'ఇదిగో నా మాటవిను. అనవసరంగా వుడుకుమోతుతనం తెచ్చుకోకు. నువ్వుబాగా ఆలోచిస్తే నువ్వే వద్దంటావు. అయినా పెద్దది మా అమ్మ వుందిగా ఆవిడతో అని చూస్తా. ఏమంటుందో.

'మీరు వూ అంటే మిగిలినవాళ్లని వప్పించే బాధ్యత నాది, తెలిసింది. బాగా ఆలోచించే చెపుతున్నా! తరువాత మీ యిష్టం.' ఈ ధోరణిలో సంభాషణ జరుగుతోంది. నాకు ఎప్పుడు నిద్దరపట్టిందో తెలీదు కాని శాంత వాకిలివూడ్చే చప్పుడుకి వులిక్కిపడి లేచి కూర్చున్నా.

కాంతమ్మ అత్తయ్య చాలా హడావిడిగా అటూ, ఇటూ తిరుగుతూ అందరికి అన్వయించేటట్లు దెప్పిపొడుస్తూ గిల్లి కజ్జా తెచ్చుకోవాలనుకున్నట్టు కనిపించింది. వాకిట్లో ముగ్గువెయ్యలేదన్న నెపముతో శాంతవీపు సుద్దిచేసింది. అమ్మమ్మ దగ్గరకి పోయి శాంత అలాపన మొదలుపెట్టింది.

కాంతమ్మ అత్తయ్య ఈనినపులిలా రంకెలు వేస్తూ అమ్మమ్మపైన యుద్ధానికి దిగింది.

'పొద్దున్నే ఎందుకే యింతరాద్ధాంతం? అయినా ఎవరు ఏమన్నారు? నిన్ను అని మా యింట్లో బతకగలమా.'

'ఆనండి అత్తయ్యా మీ యిష్టమువచ్చినట్టు వీళ్లముందు నన్ను చులకనచెయ్యాలి అనేగా మీ వుద్దేశ్యం. మీరు అంతా ఒకటే. నేనేగా పరాయిదాన్ని. ఆ సీతాపతిగారి కోడలులా అందర్ని అప్పుడే వెళ్లగొట్టివుంటే మీ చేత మాటలుపడాల్సి వుండేదేకాదు. యిప్పుడు మించిపోయింది ఏమిటి. నామాట కాదని యీ మందఅంతా నా యింట్లో ఎల్లా వుంటారో చూస్తా.'

'అమ్మాయికాంతం. చంటాడికి, మొహము కడిగి ఏమి తాగుతాడో పట్టమ్మా. రాత్రి నిద్రపోనివ్వడు. పగలు నిలవనివ్వడు. ఎల్లా చచ్చేది వీడితో' అని అన్నగారు చెపుతున్నాడు.

'ఊరుకో అన్నయ్యా వాడిని ఊరికే విసుక్కోకు. ఆ మూడుముళ్లూ పడితే వచ్చిందే చూస్తుంది. ఎవరికోసం'. అత్తయ్య ధోరణి యింకా పెరగకుండా, మామయ్య తనకి అప్పుడే ఆలోచన తట్టినట్లు అత్తయ్యని వుద్దేశించి, మన శాంతనిచ్చి చేస్తే ఎల్లావుంటింది?' ప్రశ్నార్థకంగా అందరిని తేరిపారచేశాడు.

'వాడు చేసుకోవాలంటే ఈ ముష్టిసంబంధము తప్ప దొరకదాఏమిటి?' తనకి ఎంతమాత్రము యిష్టములేనట్టు, తప్పనిసరిగా అల్లాంటిమాట వినాల్సివచ్చిందే అన్నట్టుగా మొహముపెట్టి వక్కవిసురుని లోపలికి వెళ్లింది.

మళ్లా బయటికి రావడంతో ఆవిడకంట నేను పడ్డాను. 'ఏమి అలా చెవులు నిక్కపెట్టుకు వినకపోతే కూరలకి వెళ్లరాదు. పరాయిమూకని మేపడమేతప్ప చిల్లుగవ్వంత ఉపయోగమువుండదు' అంటూ నాపైన దండెత్తింది.

సంచీ, చిల్లర నాదగ్గరపడేసి 'యింక వెళ్లు' అన్నట్టు కళ్లతో వురిమింది. వాళ్ల అన్నయ్యా ఒకవారం తిష్టవేశాడు. మొదట నాలుగురోజులు చెప్పదగ్గగొడవలు లేకపోయినా అమ్మమ్మని పెద్దత్తయ్యని చూస్తే పెద్దమామయ్య పోయినా రోజులు జ్ఞాపకమువచ్చాయి. కళ్ళు ముక్కులువాచి దిగాలు పడ్డ మొహాలుచూస్తే, నాకెంతో బాధగావుంది. అత్తయ్య మామయ్యా వాళ్ల బాధ గుర్తించినట్టేలేదు.

మొత్తానికి అత్తయ్య పట్టుఅయితేనేమి, మామయ్య అమూల్యమైన ఊహఅయితేనేమి శాంతని వాళ్ల అన్నకిచ్చి పెళ్లిచేయటానికి ఏర్పాటు జరిగింది. వ్యవధి లేకపోవడముచేత చుట్టాలు ఎవరికి తెలియపర్చలేదు. అమ్మని శాంతమేనమామ పేరయ్యగార్ని మనుషుల్ని పంపి రప్పించారు.

గుళ్ళో పెళ్లిచేయటానికి నిశ్చయించారు. ఎల్లాగో పెళ్లి అయింది. అనిపించారు. అత్తయ్య సలహామీద యిదివరకు ఉపయోగపడ్డవాళ్లని, ముందు ఎప్పుడైనా అవసరమువస్తుందేమో నన్న వాళ్లని, మర్నాడు కొందర్ని భోజనానికి పిల్చారు. వచ్చిన వాళ్ళల్లో ఒకాయన దృష్టి నామీదపడింది. ఆయన అత్తయ్య వేపు బంధువు. ఆయన ఆస్తి, ఆయనకి లేని గౌరవాన్ని యిప్పిస్తోందేమొ అనిపిస్తుంది. ఆయన ఆకారాన్ని చేస్తే నాకే బయము వేసింది. పిల్లలు చూస్తే తప్పకుండా జడుసుకుంటారు. సందేహము లేదు. 'అల్లా వెర్రిమొహము వేసుకు నుంచోక పోతే వెళ్లి ఏదయినా పనివుందేమో చూడరాదు లోపల' అనే అత్తయ్య మృదువైన కంఠధ్వనితో కొయ్యబారిన నాలో చైతన్యం వచ్చి అక్కడనుంచి కదిలించింది. వచ్చినవాళ్ళ భోజనాలు అయినాక అత్తయ్యని ఒకరు అన్నమాట యింకొకరు ఉపయోగించకుండా పొగిడిపారేశారు. 'నువ్వు కాబట్టి యిల్లా అందర్ని భరిస్తే, నాబొందో అని చేస్తున్నావుకాని యీ కాలంలో ఎవరు చేస్తారుతల్లి' అని ముక్కు తుడుచుకుంటూ ఒక ముసలమ్మగారు వాపోయింది. 'పిన్నిగారూ మీరుకాబట్టి నన్ను అర్థంచేసుకున్నారు. మావాళ్లకంటే మీరేనయము. వాళ్లకి కొంచము కూడా విశ్వాసంలేదు. అయినా నేను లెఖ్కచెయ్యను అనుకోండి. పదిమందికి ఉపకారం చెయ్యటమే నా వుద్దేశ్యం తరువాత నన్ను గురించి ఏమన్నా అనుకోనీండి' అంది అత్తయ్య.

'అంతే తల్లీ, అంతే పరమార్థచింతవున్న వాళ్లంతా వాళ్లనిగురించి ఆలోచించుకోరు. మరినే వెళ్లివస్తా. ఎప్పుడైనా అల్లా ఆశ్రమంకేసి వస్తూవుండు' అని ఆవిడ వెళ్ళడానికి ఉపక్రమించారు. 'అత్తయ్య బంధువుగారు నిద్రలేచి వళ్ళు స్వాధీనములోకి తెచ్చుకొని, ఏమే అమ్మాయి నేనుకూడా బయలుదేరుతా' అని ఒక్క పొలికేకపెట్టాడు మృదువుగా గార్ధభస్వరంతోటి. 'అయితే యిందాక మనము అనుకున్న మాట వాళ్ళతో సంప్రతించి వెడుదువుగాని రాత్రికి ఉండి ప్రొద్దుటే వెళ్ళరాదు. వాళ్ళ అమ్మకూడా ఉందాయె' అని మా అమ్మని సంబోధిస్తూ హెచ్చరించింది అత్తయ్య. మామయ్య కొంచెము కాఫీ పెట్టరాదుటే బద్ధకం పోతుంది' అంటూ ఆయనదగ్గరకి వచ్చికూర్చున్నాడు. అత్తయ్య కాఫీ పని చిన్నత్తయ్యకి పురమాయించింది. అమ్మ, అమ్మమ్మ తమ్ముగురించి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. 'అత్తయ్య ఎప్పుడు వచ్చిందో పిల్లిలా తనమాటలు కాకపోవటంవల్ల 'వాడి గొడవ యిప్పుడు తెమిలేదికాదులే మీ అన్నయ్య పిలుస్తున్నారు నిన్ను, మీ అమ్మని' అని వాళ్ళని పంపి వంటయింట్లో ఏమి జరుగుతోందో ఒక్క చూపుచూసి వాళ్ళ దగ్గరకి వెళ్లి పోయింది. నాకు చిన్నత్తయ్యకి సాయం చెయ్యమని పురమాయించింది. తరువాత వాళ్ళ సంభాషణ ఏమిజరిగిందో తెలీదుకాని, పర్యవసానం ఆయన కూతుర్ని నాకిచ్చేందుకు నిశ్చయించుకున్నారట. జాతకాలు చూసుకు, నాన్న ఒప్పుకుంటే వచ్చేవారం ముహూర్తం ఉందిట. అమ్మవచ్చి నాదగ్గరచెప్పి యింకా ఏదో చెప్పబోతోంటే అత్తయ్య తల్లీ కొడుకుల రహస్యాలు వినవచ్చానంటే వచ్చి మధ్యన తిష్టవేసింది. 'రొట్టె నేతిలో పడ్డట్టు అదృష్టవంతుడవోయి అల్లుడా' అంటూ వేళాకోళం మొదలుపెట్టింది. బోలెడు ఆస్తి, ఆదరించే అత్తా మామ, ఒక్కర్తే కూతురు, పిల్ల నలుపయితేమాత్రము ఏమిలే. ఆంతాస్తి సంపాయించాలంటే యింకోజన్మ ఎత్తాలి. మీ అమ్మకి కోడలు అప్సరసకావాలని వుంది. అసలు ఆయనికి అంత ఆసక్తిలేదు. నా ప్రోద్బలమువల్ల సరేనన్నాడు. ఆవిడ అయితే

వెయ్యి వంకలు చెప్పి వప్పుకునేదికాదు. మీరుకూడా ఆలోచించుకోండి. నేనుంటే మీకు అడ్డు ఏమో వెడతా' అంది అత్తయ్య.

'అవి ఏమిమాటలు వదినా. నువ్వు మాకేమి అడ్డు. వదినా మనలోమాట, పిల్ల బొత్తిగా బాగుండదు అంటావా?'

'పిల్లకేమమ్మా నిక్షేపంలా ఉంటుంది. ఏటొచ్చీ కాలు వక్కరవ యీడుస్తుంది. ఏవంకా లేకపోతే మీ తాహతుకి వాళ్ళ పిల్లని యిస్తారా?'

అదికాదు వదినా డబ్బుకోసం కక్కుర్తిపడితే వాడికి జీవితాంతాం సుఖము వుండదేమొ అనిపిస్తోంది. ఈ రెండేళ్ళు గట్టెక్కితే వాడే సంపాయించుకుంటాడు'. అయినా నీ వెఱ్ఱికాని పాస్ అయితే ఏ అరవయ్యో యిస్తారు. లేకపోతే అది లేదు. తనేతింటాడా? మిమ్మల్నే పోషిస్తాడా? పెళ్లాన్నే చూసుకుంటాడా? అయినా మీ యిష్టం మీ పిల్లాడు. వాళ్ళ పిల్ల మధ్యవాళ్లం బాగుండాలనుకుంటాము. అయినా యీ గొడవలు నాకెందుకంట. నామాట మీరు వింటారుకనకనా?'

'అదేమి వదినా, అల్లా అంటావు. నీమాట ఎప్పుడు కాదన్నాను? నీకూ అన్నయ్యకీ నచ్చితే అల్లాగే కానీయండి' అంది అమ్మ.

అత్తయ్య ప్రభావం అయితే ఏమి మామయ్య ఆలోచనలయితే ఏమి, నాపెళ్లికూడా ఆ ముహూర్తానికే కానిచ్చారు. నాన్నమాత్రము ఎందుకో రుసరుసలాడారు. బామ్మ, కొందరు బంధువుల కళ్ళు తుడుచుకున్నారు. 'పండంటి పిల్లాడు. కాకిముక్కుకి దొండపండులావుంది. ఏమిచేస్తాము. అంతా ఘటన'.

పిల్లవేపు కొందరు పెద్దలు అబ్బే ఏమి సంబంధం బొత్తిగా ఏమీ లేదు అనుకుంటా, యింతమాత్రము దొరకదనే కుదుర్చుకున్నట్టున్నారు' అని యీసడింపులు, ఇక్కడ మాటలు అక్కడికి అక్కడివి యిక్కడికి నడిచి చిన్న చిన్న యుద్ధాలు కలిగి చిన్న చిన్న ఉడుపులతో కొంత గడబిడతో పెళ్ళి అయిందని పించారు. ఎక్కడవాళ్ళు అక్కడికి వెళ్ళారు. అమ్మ, తమ్ముడు, నేను మిగిలాము. పెళ్ళి మామయ్య గారింటిదగ్గరే కనక వాళ్ల కుటుంబము అంతా వున్నారు. 'మమ్మల్ని మూడు నిద్దర్లకి వాళ్ళవూరు తీసుకువెడదాము' అనుకుని మళ్ళీ 'ఎందుకు ఖర్చు' అనుకున్నారో ఏమో అవికూడా యిక్కడే కానిచ్చారు.

అమ్మని, తమ్ముణ్ణి వియ్యపురాలి తల్లి చులకనగా మాట్లాడిందట. అమ్మ కళ్ళనీళ్లు పెట్టుకుంటూ నా దగ్గరకి వచ్చింది. 'బోల్తాపడ్డాముర యిప్పుడు ఏమి అనుకుంటే ఏమిలాభము. యింక నిన్ను మాతో కలవనివ్వరు. వాళ్ళ ధోరణిచూస్తే అల్లాగేవుంది. పోనీ నువ్వేనా సుఖపడితే అంతేచాలు. అది కూడా వుండదేమోనని భయంగా వుంది.' నాకీ పెళ్ళి అసలే యిష్టంలేనట్టు అమ్మకేసి చూశా.

భోజనాలవేళ ముసలమ్మగారు 'మళ్ళీ మళ్లీ వాళ్ళంతా రావాలంటే బోలెడు ఖర్చు. ఆ లాంఛనముకూడా యిప్పడే కానివ్వండి, వదిలిపోతుంది' అని సలహాయిచ్చింది. నాకు వళ్లుమండి సమాధానము చెబుదాము అని నోరు తెరచా - అత్తయ్యని చూసి మంచినీళ్ళుత్రాగి వూరుకున్నా.

అమ్మ ఆరోజే వెళ్ళిపోవాలని చెప్పింది. 'ఏమితొందరవచ్చింది, రేపు వెళ్ళకూడదూ. మళ్ళీ మళ్ళీ ఖర్చుపెట్టాలంటే డబ్బు ఏమన్నా కొట్టుకొస్తుందా? అయినా వుందిగదా అని విరగపడితే, వియ్యాలారిలాగే అవుతుంది. నీ యిష్టం' అని కూతుర్ని హెచ్చరించింది ముసలావిడ.

అమ్మకి పౌరుషమువచ్చి 'మీరు కొంచెము మర్యాదగా మాట్లాడాలి. మేమూ తిండి తింటున్నాము, బట్ట కట్టుకుంటున్నాము, మర్యాదగానే బ్రతుకుతున్నాము, మీలా మడి మాన్యాలు లేకపోవచ్చు, పిల్ల నిచ్చుకున్నవాళ్ళు కొంచెము అణుకువగా వుండటము మంచిది'.' 'అబ్బో అంతమాత్రము నాకు తెలీదు. నీ దగ్గర నేర్చుకోవాలి. అయినా లేనివాళ్ళకి డబ్బువిలువ ఏమి తెలుస్తుంది? నా పిల్లకి తండ్రి యిచ్చి చచ్చాడు. నా అల్లుడు నే చెప్పినట్లు విని వృద్ధిచేసుకున్నాడు. ఇంక ఆయన అల్లుడు ఏమి వుద్ధరిస్తాడో చూడాలి.' వాదవివాదాలు పూర్తి అయి అమ్మ మర్నాడు వెళ్ళేందుకు వప్పుకుంది. చిన్నమామయ్యకి ఏదో వుద్యోగము అయిందట. అమ్మమ్మనిచ్చి అత్తయ్యని పంపమని ఉత్తరం వచ్చింది. పెద్దత్తయ్యని కూతురికి సాయంగా వుండేందుకు పంపారు. అమ్మమ్మ వాళ్ళు అటూ, అమ్మావాళ్ళు యిటూ మర్నాడు ప్రయాణం పెట్టుకున్నారు.

ముసలావిడ అనుకున్నట్టు అన్నీ జరిగాయి. కాంతం అత్తయ్యకి పేరుదక్కింది. మా బాధలు ఎలా వున్నా, అందర్నీ వదుల్చుకుంది. అమ్మని రైలు ఎక్కించేందుకు స్టేషనుకి వెళ్ళాను. అమ్మకళ్ళల్లో నీళ్లుతిరిగాయి. తమ్ముడు 'నువ్వుకాబట్టి యిల్లా బుట్టలో పడ్డావు కాని, నేనవుతేనా' అన్నట్టు చొక్కా దులుపుకు బుజాలు ఎగరవేసి నాకేసి చూశాడు. నాకు అమ్మతో ఏమి మాటాడాలో తెలీలేదు. నన్ను అసలు చదువుకి పెట్టక పోతే యిటువంటి అవాంతరాలు వచ్చేవికాదుకదా అనిపించింది. అమ్మకి నామీదవుండే ప్రేమ, చదువుమీదవుండే పట్టుదల, పెళ్ళిలో జరిగిన అవమానాలు అన్నీ ఆ కళ్ళలో కనిపించాయి. 'నువు ఏమిచేస్తావోరా' అన్నట్టు చూసింది.

రైలు వస్తూంటే ఎందుకో గుండెలు దడదడలాడాయి. అమ్మని బండి ఎక్కించా. అమ్మ, తమ్ముడు, 'వెడుతున్నాము' అని పదిసార్లు చెప్పారు. నాకు ఎందుకో కళ్ళనీళ్లు తిరిగాయి. నేను వాళ్ళకి పరాయివాణ్ణి అయిపోతున్నానేమోనని భయమేసింది. ఏమయ్యా నామామ యిలా మాత్రము కాకూడదు అనుకున్నా. రైలుకూతవిని వులిక్కిపడి 'మళ్లా ఎప్పుడు వస్తావమ్మా' అన్నా అర్థంలేని ప్రశ్న.

రైలు కదిలింది. తమ్ముడు 'నీదో ప్రపంచము మాదోకటి' అన్నట్టుచూశాడు. అమ్మ నేను యింక వాళ్ళకి ఎందుకుపయోగ పడనట్టు నిరాశతో చూసినట్లు అనిపించింది. కనిపించేటంతవరకూ చూస్తూ నిలుచున్నా. ప్లాటుఫారం పల్చపడింది. నేను కొంతసేపు బల్లపైన కూర్చున్నా, ముందు భవిష్యత్తులో ఎల్లావుండాలో, ఎవళ్లు ఏమి అంటే తను ఎల్లా బదులు చెప్పాలో యిల్లాంటి తీర్మానాలు చేసుకుంటూ ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు చేస్తూ చాలాసేపు అక్కడ గడిపాను. నేను ఆ వూరు వచ్చిన కొత్తలో వున్న ఆ పోర్టర్లు యిద్దరే తన వేపు రావటం చూశాను. మళ్ళా వీళ్లు నన్ను యిక్కడ నుంచి వెళ్ళమనో, చచ్చిపోవద్దనో సలహా యివ్వకుండా యిక్కడనించి కదలటం మంచిది అని లేచా. అందులో ముసలాడు నన్ను పరకాయించి చూసి దీపం వెలిగించేందుకు వెళ్లాడు.

నేను యింటికి చేరుకునేసరికి బాగా చీకటిపడింది. ముసలమ్మగారు సగము నిద్రలోలేచి విసుక్కోవడము మొదలు పెట్టింది. 'బండి వెళ్ళి ఏజాము అయింది. ఇంతసేపు ఎక్కడి కెళ్లావు' అంటూ ప్రశ్నలు కురిపించింది. తరువాత అత్తయ్య అందుకుంది. 'ఇంకా వారంకాలేదు పెళ్ళి అయి. చీకట్లో అల్లా తిరగవచ్చా' అంటూ కొత్తరకంగా మర్యాదగా చివాట్లు వేసింది. 'వీళ్ళందరితోటి ఏమిటి, నాకోసమైనా తొందరగా రావద్దా' అని చిన్న దీపము వెలుగులో పెద్ద కళ్లు జాలిగా మెరుస్తూ నాకేసి చూశాయి. నా తీర్మానాలన్నీ కరిగి పోయాయి. పిల్లిలా వెళ్ళి భోంచేసివచ్చా. ఎవరికీ ఏ సమాధానము చెప్పలా. 'కాగడాలా ఈ దీపము

ఎందుకు నాయనా పడుకోరాదు వెళ్లి' అన్న అదలింపుతో అక్కడనించి కదలడం జరిగింది. కాని నోరువిప్పి సమాధానం చెప్పలేకపోయా.

'వాళ్లు విసుక్కుంటే నేను ఏమి చెయ్యనన్నట్టు' ఆ కళ్ళు నన్ను వోదార్చాయి. మామయ్య అందుకే యేమో అత్తయ్యమాట దాటడు.

నేను అల్లా అయిపోతానా? చీకట్లోకిచూస్తూ, అరుగుమీద కూర్చున్నాను. తల్లి కళ్ళు జాలిగా చూస్తున్నట్టు మనస్సుల్లోంచి పోవటంలేదు. ఎన్ని అవమానాలైనా భరించిచదువు పూర్తిచేసుకోవాలి. అది పొట్టకోసం చదువు కాకూడదు. విజ్ఞానముతో, ఆత్మవికాసం కలిగించేదిగా వుండాలి. తీరిక సమయాల్లో చదువుకునే పిల్లలకి సహాయపడాలి. ఇంగ్లీషు లెక్చరరు అంటే తన కెంతో అభిమానము. తన జీవితంలో కోరికలు తీరాలంటే చదువు పూర్తి అవ్వాలి. ఇంకా ఆలోచనలు పూర్తి అవ్వాలి. ఇంకా ఆలోచనలు పూర్తికాకుండానే, అత్తయ్య అరుగుమీదకి వచ్చి "చీకట్లో ఏమిచేస్తున్నావు? వెళ్ళి పడుకోరాదు!' అంది. మామయ్యవచ్చి కూర్చుని, "అత్తయ్యలాంటి మంచిమనస్సు కలవాళ్ళు వుండటం చాలా అరుదు" అని, "తన అదృష్టం కొద్దీ దొరికింది అని చెపుతున్నాడు. "మీ మామయ్య మాటలు వింటూంటే తెల్లారుతుందికానీ వెళ్ళు లోపలికి, పొద్దుపోయింది." తనకి పొగడ్తలు వినటం యిష్టంలేనట్లు పైకి నటిస్తూ, లోపల ఆనందించే నేర్పు కాంతము అత్తయ్యకి తప్ప యింకా ఎవరికీ అసాధ్యము.

✧

సి. పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం
గ్ర ం థ, వరుస సంఖ్య E 15735
తేది